భూ సారాన్ని కాపాడాలి

హాజీపూర్, మే 14 : నేల సారాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతులపై ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివకృష్ణ అన్నారు. మండలంలోని జడ్పీ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి హాజరై, రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో తక్కువ యూరియా వాడడం, సాగు ఖర్చులు తగ్గించడం, అవసరం మేరకు రసాయన ఎరువులు వినియోగించడంతో పాటు, నేల సారాన్ని కాపాడవచ్చునన్నారు. కొనుగోలు చేసిన ఎరువుల రసీదులను భద్రపర్చడంతో కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చునన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత, విత్తన ధ్రువీకరణ అధికారి సురేశ్ కుమార్, బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, పంట ఉత్పాదక శాస్త్రవేత్త స్రవంతి, హాజీపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి సహజ, ప్రసన్న, వ్యవసాయ విస్తరణ అధికారి ఉదయ్‌కుమార్, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా అమలు చేయాలి

కెరమెరి, మే 14 : రాజీవ్ యువ వికాసం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. కెరమెరి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను పరిశీలించి, నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రక్రియను పరిశీలించారు. అలాగే శివగూడ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో భాగంగా మంచినీటి బావి మరమ్మతులు, చెక్ డ్యాం నిర్మాణం, మిషన్ భగీరథ నీటి సరఫరా పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, మండలాభివృద్ధి అధికారి మహ్మద్ అమ్జద్ పాషా, నీటిపారుదల ఈఈ సిద్ధిఖీ, నీటిపారుదల ఏఈ విశ్వేశ్వర్, హౌసింగ్ ఏఈ రత్నం, ఏపీవో, ఏపీఎం, ఈసీ, టీఏ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

మందమర్రి, మే 14 : మందమర్రి పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సీఎండీ ఎన్ బలరాం నాయక్ పేర్కొన్నారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, పాఠశాల లోగో ఆవిష్కరించారు. మందమర్రి పట్టణంలో 50 ఏండ్ల క్రితం సింగరేణి ఎయిడెడ్ పాఠశాలలో సుమారు 40 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించి, దేశ విదేశాలలో స్థిరపడ్డారని, సింగరేణి సంస్థలో కూడా అనేక మంది వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారని తెలిపారు. సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పా, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు, కార్యదర్శి జీ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సునీల్ కుమార్, కరస్పాండెంట్, ఏరియా పీఎం ఎస్ శ్యాంసుందర్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మంచిర్యాలటౌన్, మే 14 : కాళేశ్వరంలో 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతీ పుష్కరాల సందర్భంగా మంచిర్యాల పరిసర ప్రాంత ప్రయాణికుల కోసం మంచిర్యాల, చెన్నూర్ బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 రోజుల పాటు ప్రతి రోజూ ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. మంచిర్యాల నుంచి ఫుల్ టికెట్ రూ.150, హాఫ్ టికెట్ రూ.80 ఉంటుందని, చెన్నూర్ నుంచి ఫుల్ టికెట్ రూ.80, హాఫ్ టికెట్ రూ.50గా నిర్ణయించినట్లు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

సీసీసీ నస్పూర్, మే 14 : ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారులు తప్పసరిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ సూచించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూగర్భ, ఉపరితల గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, ఉత్పత్తి, తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఆర్కే-6, ఆర్కే న్యూటెక్ గనులకు 5స్టార్ రేటింగ్ రావడం అభినందనీయమని, అందుకు కృషిచేసిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం బీభత్స, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ పీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, ఎంవీటీసీ ఎస్వోఎం రామారావు, ఏరియా స్టోర్ అధికారి మల్లయ్య, సర్వే అధికారి నర్సింగరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దహెగాం కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు కప్పి ఉన్న ధాన్యం కుప్పలు

తాండూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలను పక్కన పెడుతున్న రైతులు

మందమర్రి రూరల్ : సారంగపల్లిలో తడిసిన ధాన్యం బస్తాలు

అకాల వర్షం.. అన్నదాత ఆగం

- ఈదురుగాలులతో కూడిన వానకు తడిసిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు
- ఆలస్యం చేస్తున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులతో పాటు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రైతులను ఆగమాగం చేసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో అష్టకష్టాలు పెడుతున్నది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యంతో పాటు, పలు చోట్ల వరి కోతలు పూర్తిచేసుకొని, పంట నూర్పిడి అయ్యాక ఎండలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. పంట విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో వేచి చూస్తున్న అన్నదాతకు చివరికి కన్నీరే మిగిలింది. దీనికి తోడు కొనుగోళ్ల ఆలస్యమవుతుండడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది.

చెన్నూర్ రూరల్, మే 14 : చెన్నూర్ మండలంలోని కొమ్మెర, పొక్కూర్, ఆస్నాద్, ఎర్రగుంటపల్లి, కిష్టంపేట, ముత్తరావుపల్లి, ఒత్కులపల్లితో పాటు, పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడిసింది. ఆస్నాద్‌లో దాన్యం కొట్టుకపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెంతున్నారు. అధికారులు నిబంధనలు పెట్టకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దహెగాం, మే 14 : లగ్గాం, దహెగాం, ఒడ్డుగూడ, గిరివెల్లి, కొంచవెల్లి, కల్వాడ గ్రామాల్లోని కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరపెడుతున్నారు. నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కాంటా వేయడంలేదని రైతులు అంటున్నారు. టార్పాలిన్ కప్పినా కూడా వర్షానికి కింది నుంచి నీరు వచ్చి ధాన్యం మొలక వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు.

తాండూర్, మే 14 : మండలంలోని రేచిని, తాండూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తూకం వేసిన బస్తాలు, వడ్ల కుప్పలు కూడా తడవగా.., రైతులు బస్తాలు పక్కకు తీయడంతో పాటు కుప్పలను నూర్పిడి చేసి ఆరబెడుతున్నారు.

మందమర్రి రూరల్, మే 14 : మందమర్రి మండలం సారంగపల్లి, పొన్నారం, గుడిపెల్లి, వెంకటాపూర్, బొక్కలగుట్ట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఆ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కాగా, అధికారులు సకాలంలో కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నెల నుంచి కేంద్రాల్లోనే ధాన్యం మగ్గుతున్నదని అంటున్నారు. వారం రోజులుగా గాలి దుమారం వస్తుండడంతో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నట్లు వాపోయారు.

దండేపల్లి, మే 14 : దండేపల్లి మండలం తాళ్లపేట కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యంతో పాటు, తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఆరబెట్టిన మక్కలను కాపాడుకోవడానికి టార్పాలిన్లు కప్పి ఉంచారు.

భీమారం, మే 14 : భీమారం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ధాన్యం తడిసింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తరుచూ వర్షం పడుతుండడంతో ప్రభుత్వం నుంచి టార్పాలిన్లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కోటపల్లి, మే 14 : ఓ వైపు వర్షాలు కురుస్తుండడం.., మరోవైపు ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకాశం మబ్బులు కమ్ముకున్నప్పుడల్లా కొనుగోలు కేంద్రాల వైపు పరిగెత్తి రక్షించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కోటపల్లి కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండగా, ప్రతీ కేంద్రంలో ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి.

జైపూర్, మే 14 : జైపూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎక్కడికక్కడ తడిసిపోయింది. సరిపడా టార్పాలిన్లను అధికారులు సరఫరా చేయకపోవడంతో పాటు, కేంద్రాల్లో హమాలీలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నష్టం జరిగినట్లు రైతుల వాపోయారు. 15 రోజుల క్రితం తెచ్చిన ధాన్యం ఇప్పటికీ కాంటా చేయకపోవడంతోనే ధాన్యం తడిసిందని మండిపడుతున్నారు. రామరావుపేటలో ధాన్యం తరలించేందుకు ఐకేపీ సిబ్బంది ఓ రైస్ మిల్లర్‌తో కుమ్మక్కై ధాన్యాన్ని తరలించేందుకు ఒక్క లారీని ఏర్పాటు చేయడం మూలంగానే ఈ పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోటపల్లి : పారుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

భీమారంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

జైపూర్ : రామారావుపేట కొనుగోలు కేంద్రంలో..

రెవెన్యూ దరఖాస్తులను విచారించాలి

దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

పెంచికల్‌పేట్, మే 14 : భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో, ఎల్కపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి సందర్శించారు. భూ భారతిపై అధికారులు, రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పెంచికల్‌పేట మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసుకొని, 12 రోజుల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్ రావు, కవిత, ఎంపీడీవో అల్బర్ట్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మంచిర్యాల అర్బన్, మే 14 : బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ సూచించారు. మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో బుధవారం ముస్లిం మత పెద్దలు, సోదరులతో ఏసీపీ ముందస్తు సమావేశం నిర్వహించారు. జంతువులను వెటర్నరీ డాక్టర్ ముద్ర సూచనల ప్రకారం కొనుగోలు చేయాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు. సీఐ ప్రమోద్ రావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏఎంవీఐ షేక్ ఖాసీం, మాజీ కౌన్సిలర్ మీనాజుద్దీన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

నస్పూర్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 14 : మంచిర్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, వార్షిక ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఇంటర్, ఐటీఐ ఇతర రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించాలని తెలిపారు. కోటపల్లి, జైపూర్, దండేపల్లి, తాండూర్ మండలాల్లో నూతన వసతి గృహాలు మంజూరయ్యాయని, విద్యార్థులను చేర్పించేందుకు సంబంధిత అధికారులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అన్ని జూనియర్ కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలతో జారీ చేసిన ఫైర్ సేఫ్టీ, శానిటరీ సర్టిఫికెట్, సేఫ్టీ సౌండ్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని సూచించారు. మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూర్, బెల్లంపల్లి, జైపూర్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 95 అగ్ని నిరోధక వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలి

భీమారం, మే 14 : భీమారం మండలానికి 20వ తేదీన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. పోలంపల్లి గ్రామంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టంలో భాగంగా భీమారంను పైలెట్ మండలంగా ఎంపిక చేసి, దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వాంకిడి, మే 14 : నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని రాళ్ల బోరిగాం గ్రామ దళితులపై దాడిచేసిన అగ్రవర్ణాల గుండాలను కఠినంగా శిక్షించాలని బౌద్ధ, అంబేద్కర్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం వారు మాట్లాడారు. వైశాఖ బౌద్ధ పూర్ణిమ సందర్భంగా గ్రామ దళితులు బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేసుకొని బుద్ధపూర్ణిమ జరుపుకోగా, జీర్ణించుకోలేని అగ్రవర్ణాల వారు దాడి చేయడం అన్యాయమన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కర్, ఉపాధ్యక్షులు వినేష్, శ్యామ్‌రావ్ లాహు దుర్గే, సమతా సైనిక దళ్ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, అంబేద్కర్ సంఘం కార్యదర్శి రాంటెంకి ప్రతాప్, నాయకులు రోషన్ ఉప్రే, సురేందర్ ఉప్రే, బల్వంత్, పోచాలు, మనోజ్, చింటూ, స్వాగత్, వివేక్, అన్నా రావ్, సంజు, మోను, మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

హాజీపూర్, మే 14 : హాజీపూర్ మండలంలో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉన్నతాధికారుల పర్యటన సమయంలో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా తనిఖీలు చేసేవారు. కానీ, ఎప్పుడూ లేని విధంగా బుధవారం జాతీయ రహదారి వెంట డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయడంతో మండల ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ప్రశాంతంగా ఉన్న సమయంలో బెల్లంపల్లి నుంచి వచ్చిన ప్రత్యేక డాగ్ స్క్వాడ్ టీంతో కలిసి తనిఖీలు చేపట్టడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్ గానీ, ఏదైనా సమాచారం అందడంతో తనిఖీ చేపట్టారా అనేది తెలియాల్సి ఉంది. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్‌ను సంప్రదించగా, సాధారణ తనిఖీల్లో భాగంగానే పోలీసు సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నామన్నారు.

హక్కుపత్రాలుంటేనే సాగు చేయాలి

తాండూర్, మే 14 : అటవీ హక్కు పత్రాలున్న రైతులే పోడు భూములు సాగు చేయాలని తాండూర్ సెక్షన్ అధికారి సువర్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూర్ సెక్షన్ కొత్తపల్లి బీట్ పరిధి రైతులతో బుధవారం ఆమె సమావేశం న్విహించారు. హక్కుపత్రాలు లేని రైతులు భూములు సాగుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీట్ అధికారి గోపికృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), మే 14 : సంచార కులాలకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఇందులో ప్రముఖంగా ఆరు డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్‌లో సంచార కులాలను చేర్చడంతోపాటు, బీసీ, ఎంబీసీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ, డీఎన్టీయుల స్థితి గతులపై బీసీ కమిషన్‌తో అధ్యయనం చేయించి, వారి అభ్యున్నతికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య భాస్కర్, నెన్నెల నర్సయ్య, చేరాల వంశీ, గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్

హాజీపూర్, మే 14 : రామగుండం పోలీస్ కమిషనర్ అంబరిశోర్ ఝూ ఆదేశాలతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. వివిధ కేసుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చే పౌరులకు అందుతున్న సేవలపై ఫీడ్ ఇచ్చేందుకు ఈ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. స్టేషన్‌ను వచ్చే వారికి రిసెప్షన్ ఆఫీసర్‌తో పాటు ఇతర సిబ్బంది క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తారన్నారు.

మహిళల రక్షణకే షీ టీంల ఏర్పాటు

సీసీసీ నస్పూర్, మే 14 : మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీ టీంలను ఏర్పాటు చేసినట్లు షీటీం ఎస్ఐ ఉషారాణి తెలిపారు. నస్పూర్ కేజీబీవీలో బుధవారం విద్యార్థులకు షీ టీంపై అవగాహన కల్పించారు. ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీం కర్తవ్యమన్నారు. ఈ సదస్సులో షీ టీం సభ్యులు శ్రవణ్, జ్యోతి, భరోసా సెంటర్ సభ్యులు, పాఠశాల సోషల్ ఆఫీసర్ మౌనిక పాల్గొన్నారు.

మహారాష్ట్ర ధాన్యం కొనుగోలు చేయద్దు

కోటపల్లి, మే 14 : మహారాష్ట్ర నుంచి వచ్చే వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రాఘవేంద్రరావ్ హెచ్చరించారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ధాన్యాన్ని కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామం సమీపంలోని చెక్‌పోస్టు వద్ద గుర్తించిన తహసీల్దార్, ఎస్ఐ రాజేందర్ వెనక్కి పంపారు. అనంతరం కొల్లూరు, రాపనపల్లి, దేవులవాడ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణారెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీసీసీ నస్పూర్, మే 14 : దేశవ్యాప్తంగా 20న నిర్వహించే సమ్మెను సింగరేణిలో కార్మికులు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ-3 గనిలో బుధవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు కలిసి సమ్మెకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. సింగరేణి కార్మికుల సమస్యలను జోడిస్తూ ఒక్కరోజు టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మురళీ చౌదరి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని కుమారస్వామి, తిరుపతిరాజు, సీఐటీయూ నాయకులు నాగరాజుగోపాల్, శ్రీనివాస్, చంద్రశేఖర్, టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సాధుల భాస్కర్, ఐఎఫ్‌టీయూ నాయకులు కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, మే 14 : మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 ఇంక్లైన్ గనిపై జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్, ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్, సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి బైరి శంకర్, ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీనారాయణ, రాజేందర్, సురేశ్, ఐఎన్టీయూసీ నాయకులు సోగాల కన్నయ్య, రాజ్‌కుమార్, సంపత్, రాజేశం, టీబీజీకేఎస్ నాయకులు చల్లంగి శ్రీనివాస్, అబ్దులుద్దీన్, రమేశ్, సతీశ్, సీఐటీయూసీ నాయకులు దెబ్బటి తిరుపతి, శ్రీధర్, రమేశ్, దినేశ్, అశోక్, శ్రీహరి, రవి, లింగయ్య, శంకర్, రాజ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెకు దూరంగా ఉండండి

సీసీసీ నస్పూర్, మే 14 : కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని, విధులకు హాజరై లక్ష్య సాధనకు సహకరించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ కోరారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులకు డిమాండ్లు లేవని, సంస్థ పరిధిలో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్, డీవైపీఎం కాంతారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ టౌన్, మే 14 : ఆపరేషన్ సింధూర్ పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుమ్రం భీం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్ పేరిట ఆర్మీలో చేరాలంటూ సైబర్ నేరగాళ్లు ఫేక్ లింకులు పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి మెస్సేజ్‌లను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్లకు మాత్రమే స్పందించాలని సూచించారు.

అదుపు తప్పిన కారు

- నీల్వాయి రేంజర్ అప్పలకొండకు గాయాలు

కోటపల్లి, మే 14 : కోటపల్లి నుంచి చెన్నూర్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పడంతో అందులో ఉన్న నీల్వాయి ఫారెస్ట్ రేంజర్ అప్పలకొండకు స్వల్పగాయాలయ్యాయి. నీల్వాయి నుంచి చెన్నూర్‌కు తన కారులో వెళ్తుండగా, కోటపల్లి-చెన్నూర్ అటవీ ప్రాంతంలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. వెంటనే అప్పలకొండను చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి, అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

సిద్దిపేటలో మల్కెపల్లి యువకుడి మృతి

కాసిపేట, మే 14 : సిద్దిపేటలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాసిపేట మండలం మల్కెపల్లికి చెందిన లారీ డ్రైవర్ అడ్డూరి రాకేశ్(26) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డూరి రాకేశ్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సిమెంట్ లోడ్‌తో మంగళవారం రాత్రి వెళ్తుండగా, సిద్దిపేటలో రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టడంతో లారీ బోల్తా పడింది. రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువకుడి అదృశ్యం

కెరమెరి, మే 14 : మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన చెర్ల లక్ష్మణ్(28) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి చెర్ల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి లక్ష్మణ్ కనిపించలేదు. సమీప గ్రామాల్లోని బంధువులను అడిగినా ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 99123 01125, 79936 41553 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

అతిగా మద్యం తాగి ఒకరి మృతి

రామకృష్ణాపూర్, మే 14 : రామకృష్ణాపూర్‌లోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు పెండెం రామకృష్ణ (40) అతిగా మద్యం తాగి మంగళవారం రాత్రి మృతిచెందాడని పట్టణ ఎస్ఐ జీ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణకు 12 ఏండ్ల క్రితం మౌనికతో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా ఇద్దరు విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఎండలో తిరిగి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం 9 గంటల వరకు రామకృష్ణ అలికిడి వినబడకపోవడంతో అనుమానం వచ్చి చూడగా, చనిపోయి కనిపించాడు. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకట్రావు పల్లి మండలం టేకుమట్లలో నివాసం ఉంటున్న అతని తమ్ముడు పెండెం శ్రీధర్‌కు సమాచారం అందించారు. అతిగామద్యం తాగడం వల్ల గానీ, ఎండ వేడి వల్ల గానీ మృతి చెంది ఉంటాడని తమ్ముడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కరాల్లో సేవా స్టాల్ ఏర్పాటు

రెబ్బెన, మే 14 : సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వద్ద సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా శిక్షణ పొందిన మహిళలు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. సింగరేణి సేవా సమితి ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసేందుకు సేవా సభ్యులు ముందుకు రావాలని పేర్కొన్నారు. వివరాలకు సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ 99512 14116 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయంలో పీవో తనిఖీ

జన్నారం, మే 14 : జన్నారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ప్రజలు చేసుకున్న దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, రాజీవ్ యువ వికాసం కోసం ఎంతమంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో ఉమర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఉమర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల మంజూరు

మంచిర్యాల అర్బన్, మే 14 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలటీ దవాఖాన భవన నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి నిధులు మంజూరు చేసింది. 600 పడకలతో నిర్మిస్తున్న ఈ దవాఖానకు మొత్తంగా రూ.300 కోట్లు కేటాయించారు. ప్రారంభంలో రూ.50 కోట్లు విడుదల చేయగా, ప్రస్తుతం రూ.250 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 13న ఉత్తర్వులు విడుదల చేశారు. నిర్మాణం పూర్తయితే ఎంసీహెచ్ వైద్యసేవలు ఇక్కడే కొనసాగనున్నాయి.

కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలి

మందమర్రి, మే 14 : సింగరేణిలో కొత్త బొగ్గు గనులు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని, గనులు రాకపోతే సింగరేణి సంస్థ మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో అంగడిబజార్ ఏరియాలో గల శివకేశవ ఆలయ ముఖ ద్వారాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గాంధీనగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించి, పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రి/రెబ్బెన, మే 14 : కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ కోసం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సింగరేణి ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు, భూ నిర్వాసితులు, సింగరేణి ఉద్యోగుల పిల్లలు, నిరుద్యోగ యువతతో పాటు చుట్టు పక్కల గ్రామాల యువతీ యువకులు, సింగరేణి సేవా సమితి సభ్యులకు తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ ఇచ్చి, ప్రోత్సాహించాలని యాజమాన్యం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో 30 తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99512 14116 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.